ఎంబీఏ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్ఎల్బీ, మూడేళ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్/సీనియర్ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్/జర్మన్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి, బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 6వ తేదీ నుంచి, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

- అడ్డుపడిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు
- హస్తం నేతలపై తిరగబడిన స్థానిక బస్తీవాసులు

అధికారులు, నాయకులతో కలిసి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 23: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అధికారులకు సూచించారు. మధురానగర్‌కాలనీ ఎస్ఆర్ హాస్పిటల్ బ్యాక్ సైడ్ లైన్‌లో కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.30లక్షల వ్యయంతో చేపట్టినట్టు తెలిపారు. ఈ పనులు ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసినట్టు తెలిపారు. బస్తీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పనులను తామే ప్రారంభిస్తామని హల్‌చల్ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లేనిది పనులు ఎలా ప్రారంభిస్తారని కార్పొరేటర్ కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. బస్తీవాసులు కలగచేసుకొని పరిశీలించే అధికారం, ప్రారంభించే అధికారం స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు ఉందని, కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు ఏంటని ప్రశ్నించగానే కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారని హేమ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు జాకీర్, శైలెందర్, ఆనంద్, అక్రమ్, ఫజిల్, కలిమ్ మహిళా నాయకులు లక్ష్మి, సరోజినీ, లలిత, ఝాన్సీ, బస్తీవాసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం చుట్టూ గోడ నిర్మాణం దుర్మార్గం

రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్

నిరసన వ్యక్తం చేస్తున్న గజ్జెల నగేశ్, మాలమహానాడు నేత చెన్నయ్య, తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 23: ట్యాంక్‌బండ్‌పై ఉన్న భారత రాజ్యంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారని, విగ్రహం కనబడకుండా చేస్తున్నారని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్ విమర్శించారు. దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద నగేశ్ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విగ్రహం వద్ద ఎవరికీ చెప్పకుండా నిర్మిస్తున్న గోడను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌కు అవమానం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని మండిపడ్డారు. ప్రపంచంలోనే అతి పెద్ద 125 అడుగుల బాబాసాహెబ్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. విగ్రహం జోలికొస్తే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మంత్రిని కలిసిన బిక్కి ప్రతినిధులు

మంత్రిని సన్మానిస్తున్న బిక్కి ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బిక్కి) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కులాల్లోని యువత, మహిళా పారిశ్రామికవేత్తలకు వ్యాపారాభివృద్ధి, కొత్త పరిశ్రమల స్థాపన కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తూ బిక్కి మార్గదర్శకం చేస్తోందని మంత్రికి వివరించారు. బిక్కి తరపున పదిహేడు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం బిక్కి కార్యదర్శి డాక్టర్ దాసరి కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంఎస్ ఎంఈ పాలసీలో బీసీలకు సరైన న్యాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ప్రతిపాదనలకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిక్కి అధ్యక్షుడు చేరాల నారాయణ, కార్యదర్శి డాక్టర్ దాసరి కిరణ్, కోఆర్డినేటర్ పరికిపండ్ల సుమంత్, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రతిభా పురస్కారాలను అందజేసిన వంగాల బాల్‌రాజ్‌గౌడ్

ముషీరాబాద్, అక్టోబర్ 23: మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి ఉమ్మడిసింగు కృష్ణారావు 95వ జయంతిని పురస్కరించుకొని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బుధవారం బహుభాషా కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో ఆదర్శ కిరణం సంపాదకుడు వంగాల బాల్‌రాజ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ సంగీత గురువు కె.వరలక్ష్మి, ఆధ్యాత్మికవేత్త పీసపాటి నాగేశ్వరశర్మ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కవియిత్రి రాధా కుసుమ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో మానస ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు బండారుపల్లి రామచందర్ రావు, ఉపాధ్యక్షురాలు లలితవాణి, కన్వీనర్ కోకా భవాని, కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన అంబేద్కర్ కళాశాల విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న అంబేద్కర్ కళాశాల కళాశాల కరెస్పాడెంట్ డాక్టర్ జి.సరోజ

చిక్కడపల్లి, అక్టోబర్ 23: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో సత్తాచాటారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో కళాశాల విద్యార్థులు సతీశ్‌కుమార్ అండర్ 80 కేజీల కేటగిరీలో గోల్డ్ మెడల్, బి.గౌరీ 54కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల కరెస్పాడెంట్ డాక్టర్ జి.సరోజ విద్యార్థులను అభినందించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

న్యూబోయిన్‌పల్లిలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్, అక్టోబర్ 23: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం న్యూబోయిన్‌పల్లి సంజీవయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను తిరుమలగిరి మండల తాసిల్దార్ అశోక్‌కుమార్‌తో కలిసి 153మందికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్‌లో మూడేళ్లుగా ఎన్నికలు లేకపోవడంతో స్థానిక పాలన పడకేసి అభివృద్ధి, ప్రజా సంక్షేమం స్తంభించి ప్రజలు మౌలిక వసతులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో మూడు రోజులకు ఒకసారి తాగునీరు రావడం శోచనీయమన్నారు. రక్షణ శాఖ నుంచి బోర్డుకు రావలసిన సుమారు రూ.900 కోట్ల నిధులు విడుదల చేయకపోవడంతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జంపన ప్రతాప్, ముప్పిడి మదుకర్, బంగారు సదానంద్, సంజీవయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డీఎం అశోక్‌కుమార్, యాదవరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం ఏడో వార్డు పరిధిలోని లాలామియా బస్తీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. బస్తీలో కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బోర్డు ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. బోరా ముస్లిం పాఠశాల వెనుక భాగంగా డ్రైనేజీ పైపులైన్ పనులను చేపట్టేందుకు స్థానిక ముస్లింలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళీముదిరాజ్, నాగినేణి సరిత, బస్తీవాసులు పాల్గొన్నారు.

బీటెక్ కళాశాలను ఏర్పాటు చేయాలి

మారేడ్‌పల్లి: మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ బీటెక్ కళాశాల ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సంకి రవీందర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే స్థానిక విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ బీటెక్ కళాశాల ఏర్పాటుకు సానుకూలత తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డికి కంటోన్మెంట్ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ లెక్కింపు

బేగంపేట్, అక్టోబర్ 23: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు బుధవారం లెక్కించారు. రూ.12,58,724 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి తెలిపారు. లెక్కింపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఫౌండర్ సభ్యుడు సురిటీ కామేశ్, మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'గీత' సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి సావనీర్ అందజేస్తున్న అధ్యక్షుడు

చిక్కడపల్లి, అక్టోబర్ 23: గీత కార్మికుల ఉపాధి, సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం ఎంవీ రమణ అన్నారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వెంకట నర్సయ్య బుధవారం బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిశారు. సంఘం 67 వార్షికోత్సం సందర్శంగా జరిగిన రాష్ట్ర సెమినార్‌లో 22 తీర్మానాలను, సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన సావనీర్‌ను ఆయనకు అందజేశారు.

రూ.3లక్షల ఎల్వోసీ అందజేత

నల్లగుట్టకు చెందిన ఇందిరకు ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, అక్టోబర్ 23: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల ఎల్వోసీ పత్రాన్ని వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం బాధితులకు అందజేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్ట జే లైన్‌కు చెందిన మాధవికి కొంత కాలంగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతోంది. మెరుగైన వైద్య కోసం సహకరించాలని ఎమ్మెల్యే తలసానికి విజ్ఞప్తి చేశారు. ఆయన చొరవతో మంజూరైన నిధుల పత్రాన్ని బాధితురాలి తల్లికి అందజేశారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత సాధించే దిశగా అడుగులు వేయాలి

అతిథులను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఆహార భద్రత సాధించే దిశగా అడుగులు వేయాలని ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు అన్నారు. ఆహారం ప్రాసెసింగ్ ఎంతో ముఖ్యమని చెప్పారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఓయూ ఫుడ్ టెక్నాలజీ విభాగం, ఇండియన్ వుమెన్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూఎస్ఏ) సంయుక్తంగా 'ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా'అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సాయిలు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలు అత్యధిక పోషకాలతో ఎక్కువ కాలం నిల్వ ఉండేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రతిఒక్కరూ తమ ఆహారంలో తృణధాన్యాలను చేర్చుకోవాలని సూచించారు. ఇది కేవలం పోషకాల కోసం మాత్రమే కాకుండా ఆహార భద్రత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఆహారంగా కూడా ఉపయోగపడుతుందని వివరించారు. దేశ స్థిరమైన అభివృద్ధికి ఆహార భద్రత కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మెహతాబ్ బామ్‌జీ, ఐడబ్ల్యూఎస్ఏ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయఖాదర్, సదస్సు కోకన్వీనర్లు డాక్టర్ వి.భాస్కర్, డాక్టర్ ఆర్.రేణు, ఐడబ్ల్యూఎస్ఏ ప్రతినిధులు షీలా, డాక్టర్ ఉమ, డాక్టర్ గీతా శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ'పై స్పెషల్ డ్రైవ్

ఆన్ గవర్నమెంట్ డ్యూటీ తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని రాసి ఉన్న వాహనాలపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ రాంబాబు ఆధ్వర్యంలో హబ్సిగూడ చౌరస్తా సమీపంలో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. నిజంగా ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలైతే సంబంధిత పత్రాలు పరిశీలించి పంపించారు. కాని వాహనాలను నిలిపి, స్టిక్కరింగ్ తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని రాసుకోవడం నిబంధనలను ఉల్లంగించడమేనని చెప్పారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గవర్నర్‌ను కలిసిన ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం.కుమార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో వర్సిటీని మరింత ఉన్నత స్థితికి తీసుకువచ్చేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, వివిధ వర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు పాల్గొన్నారు.

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్

కూరగాయల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

రామ్ జతన్ చౌపాల్(ఫైల్)

అడ్డగుట్ట, అక్టోబర్ 23: కూరగాయల కోసమని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చిలకలగూడ దూద్‌బావికి చెందిన రామ్ జతన్ చౌపాల్(33). రామ్ సికింద్రాబాద్ స్వాతి హోటల్‌లో పనిచేస్తుంటాడు. అయితే ఈనెల 18న కూరగాయలు కొనుగోలు చేసుకొని వస్తానని చౌపాల్ ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన భార్య పింకి బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసింది. అయిన ఎలాంటి ఫలితం లేకపోవడంతో చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

చిక్కడపల్లి, అక్టోబర్ 23: ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బానోతు రాజునాయక్ వివరాల ప్రకారం.. జవహర్ నగర్ సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో సరోజిని (95) ఒంటిరిగా ఉంటుంది. పక్క అపార్ట్‌మెంట్‌లో కుమారుడు రవిచంద్ర ఉంటాడు. కాగా వృద్ధురాలు చీరకు నిప్పుటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఫ్లాట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు, కుమారుడికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. వృద్ధురాలు దాదాపు 80శాతం కాలిపోవడంతో మరణించింది. మృతిరాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతర్లు ఉన్నారు. కేసును అడ్మిన్ ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

సైరన్లపై స్పెషల్ డ్రైవ్

ఉస్మానియా యూనివర్సిటీ: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సైరన్ (మల్టీటోన్ హారన్) పై బుధవారం ఆలుగడ్డబావి ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిబంధనలు ఉల్లంఘించి, సైరన్, ఎయిర్ హారన్లు ఏర్పాటు చేసుకున్నవారిపై కేసులు నమోదు చేశారు. మల్టీ టోన్ హార్న్ ఏర్పాటు చేసుకోవడం నిషేధించారని సీఐ చెప్పారు. అత్యవసర వాహనాలైన అంబులెన్స్, ఫైర్‌ఇంజిన్, పోలీస్, నిర్మాణ సామగ్రి వాహనాలు, మోటారు వాహనాల విభాగం అధికారులు మినహా ఎయిర్ హారన్, సైరన్లను ఉపయోగించడం నిషిద్ధమన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంను ఓయూజేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఉన్నత విద్య, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా ఉండాలన్నారు. అందుకు విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యాసంస్థలకు పరిశ్రమలను అనుసంధానం చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా రంగంలో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వీసీకి పార్ట్‌టైం అధ్యాపకుల శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ (టీజీ ఏయూపీటీఏ) ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను వీసీకి క్లుప్తంగా వివరించారు. వాటిని సావధానంగా విన్న ప్రొఫెసర్ కుమార్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీ ఏయూపీటీఏ గౌరవ అధ్యక్షుడు బి.రవీందర్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ ఎం.కుమారస్వామి, ప్రతినిధులు కంచి రాజేశ్, బండారు శ్రీనివాస్, పి. శ్రీలక్ష్మి, భిక్షపతి, మంచాల లింగస్వామి, విఠల్, ఏడుకొండల్, శంకర్, శ్రీశైష్ణవ, మాధవి, పల్లవి, సాయిలు, శరీన్, సుభాష్, శేఖర్, రంజిత్, సత్యనారాయణ, యుగంధర్, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.